క్లుప్తంగా

వైభవంగా బాల బాలాజీ మాస కల్యాణం



బాల బాలాజీ స్వామి మాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: బాల తిరుపతిగా పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి మాస కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భాద్రపద శుద్ధ త్రయోదశి శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహరించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ, జయలలిత దంపతులు ప్రధానకర్తలుగా పాల్గొని స్వామి వారి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు.

కష్టపడితే విజయం తథ్యం



అంబాజీపేటలో డీఎస్సీ అభ్యర్థులను సన్మానిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

అంబాజీపేట: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితే విజయాలు తథ్యమని పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఎర్రం శెట్టి సుబ్రహ్మణ్యం, జాలెం శాంతిరాజు, పెదపూడి సందీప్, ఆలేటి సందీప్ కుమార్‌ను అంబాజీపేట స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూదాబత్తుల రమేష్, రమణ హరి, అరిగెల బుజ్జి, కోటిపల్లి శ్రీను, రావడం విజయ్ పాల్గొన్నారు.

గోగన్నమఠంలో సరస్వతీ పూజ



గోగన్నమఠంలో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

మామిడికుదురు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా గోగన్నమఠంలోని అల్లు వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద శుక్రవారం సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, పూజా సామగ్రి అందించింది. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి కుంకుమార్చనతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం విద్యార్థులు వినాయకుడిని దర్శించుకుని అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల హెల్త్ వాక్

అమలాపురం టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ 69వ బీమా వారోత్సవాలు అమలాపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం వద్ద బ్రాంచి మేనేజర్ సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐసీ ఉద్యోగులు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు పట్టణంలో హెల్త్ వాక్ చేపట్టారు. స్థానిక ఎస్ఐసీ బ్రాంచి కార్యాలయం నుంచి కిలోమీటరు మేర నడక నిర్వహించి గడియారం స్తంభం సెంటరుకు చేరుకున్నారు. ఆ సెంటరులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఎస్ఐసీ నూతన పథకాలను ప్రజలకు వివరించారు. అంబాజీపేట శాటిలైట్ ఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ కుమార్, ఏబీఎం మధుబాబు, డవలప్‌మెంట్ ఆఫీసర్లు టి.రమేష్‌బాబు, ఎన్.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఎస్ఐసీ అధికారులు పాల్గొన్నారు.

నాటక రంగ అభివృద్ధికి సహకరించాలి

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన ద్రాక్షారామకు చెందిన పెంకే అన్నపూర్ణను ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, సాంబశివరావు దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించారు. నాటక రంగ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నాటక రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు, సభ్యులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకట్రావు, పరిషత్ ఆహ్వాన కమిటీ సభ్యులు బీఎల్ నారాయణ, తీపర్తి సతీష్, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో భయం..భయం

- గోదావరి నది ఉధృతికి రేవులు ధ్వంసం
- పల్లిపాలెంలోకి చొచ్చుకొస్తున్న కెరటాలు
- సాగర సంగమం వద్ద కోతకు గురవుతున్న తీరం
- రక్షణకు సత్వర చర్యల కోసం ప్రజల వినతి



సఖినేటిపల్లిలంకలో గోదావరి నదీ కోతకు గురవుతున్న రేవు



పల్లిపాలెం సరిహద్దులో గోదావరి నదిలో దిగబడిన గ్రోయిన్

సఖినేటిపల్లి: బంగాళాఖాతానికి సమీపంలో వశిష్ట గోదావరి నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న పల్లిపాలెం గ్రామాన్ని నదీకోత నుంచి పూర్తి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సాగర సంగమానికి సమీపంలో వశిష్ట గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న తమ గ్రామంపై సముద్రం మీదుగా వీచే బలమైన ఉప్పు గాలులకు కెరటాల తాకిడి తీవ్రంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. వీటికి తోడు సాగర సంగమం నుంచి పోటెత్తే సముద్ర కెరటాలు ధాటికి వశిష్ట గోదావరిలో ఎగిసిపడే కెరటాల ప్రభావం తమ గ్రామంపై మరింత ఉంటోందని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు. ప్రతి నెలలో పౌర్ణమి, అమవాస్యలకు ఏర్పడే పోటు, పాటులతో పాటు, ప్రకృతి వైపరీత్యాలకు విరుచుకుపడే కెరటాలు రివెట్‌మెంట్‌ను దాటుకుని మరీ గ్రామం వైపునకు చొచ్చుకొని వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నది ఉధృతికి రేవులు ధ్వంసమై ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు అంటున్నారు.

అక్కరకురాని రివెట్‌మెంట్

పల్లిపాలెం నదీ పరీవాహక ప్రాంతంలో సమారు పుష్కరన్నర కాలం క్రితం నిర్మించిన గ్రోయిన్లు, వాటి మధ్య రివెట్‌మెంట్ కుంగిపోయి గ్రామానికి ముప్పుగా పరిణమించాయని స్థానికులు అన్నారు. నాటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన గ్రోయన్లు, వాటి మధ్య ఉన్న రివెట్‌మెంట్ ప్రకృతిలో వస్తున్న పెను మార్పులకు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఏళ్లు గడిచే కొద్దీ ఇవి నదీ గర్భంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ దిగబడిపోతున్న గ్రోయన్లు, చెల్లాచెదురవుతున్న రివెట్‌మెంటు గ్రామానికి రక్షణ చేకూర్చడం లేదని వారు వాపోతున్నారు.

గతంలో దశల వారీగా రక్షణ పనులు

పల్లిపాలెం గ్రామ రక్షణకు 2001లో ఎమ్మెల్యే ఏవీ సూర్యనారాయణ రాజు గోదావరి నదీ కోత నివారణకు 4 గ్రోయిన్లు, వాటి మధ్య రివెట్‌మెంటు నిర్మాణ పనులు పూర్తి చేశారు. 2008లో ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు మరో 4 గ్రోయిన్లు నిర్మాణం పనులు పూర్తి చేశారు. విపత్తుల కారణంగా పెరుగుతున్న గోదావరి అలల ఉధృతికి బలహీన పడుతున్న తీరం రక్షణకు పాలకులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు. పల్లిపాలెం చేపలరేవు వద్ద నుంచి గ్రామ శివారు వరకూ సుమారు కిలోమీటరు పొడవు ఉన్న తీరంలోని ఎనిమిది గ్రోయిన్ల ఎత్తు పెంచి, వాటి మధ్య చెల్లాచెదురవుతున్న రివెట్‌మెంటు రాళ్లను పటిష్టపరచాలని వారు కోరుతున్నారు. నదీ కోత నుంచి గ్రామాల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇప్పటికే నదీపరీవాహక ప్రాంతాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశామని ఆయన అన్నారు.

వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో భయాందోళన

ఏటా సంభవించే వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వల్ల అంతర్వేది, పల్లిపాలెం, గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, అప్పనరామునిలంకలోని గోదావరి తీరానికి ముప్పు వాటిల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా పల్లిపాలెంలో ప్రకృతి వైపరీత్యాలకు తోడు ఏటా జూలై, ఆగస్టు నెలల మధ్యలో వచ్చే వరదల ఉధృతికి తీరం మరింత బలహీనపడుతోందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

గోదావరి నదీ కోత నుంచి ఆయా గ్రామాల రక్షణ పనులకు ఇప్పటికే సుమారు రూ.200 కోట్ల విలువైన పనులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం. పనులకు అనుమతులు, నిధులు రావాల్సి ఉంది. సఖినేటిపల్లి బోను వద్ద నుంచి రేవు వరకూ, అంతర్వేది–పల్లిపాలెం లిమిట్స్‌లలో మొత్తం ఆరు కిలోమీటర్లు మేర గ్రోయిన్లు, రివెట్‌మెంట్ పనులకు ప్రతిపాదనలు పంపించాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

కాజ్‌వేను ముంచెత్తిన వరద

మామిడికుదురు: గోదావరి వరద తీర గ్రామాల వాసులను ఇబ్బంది పెడుతూనే ఉంది. రెండు రోజుల క్రితం ముంపు నుంచి బయట పడిన అప్పనపల్లి కాజ్‌వే మళ్లీ శుక్రవారం ముంపు బారిన పడింది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందుల నడుమ రాకపోకలు సాగించారు. రెండడుగులకు పైగా ఉన్న వరద నీటిలో వాహనాలు రాకపోకలు సాగించాలి. దీంతో పాటు అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు సైతం అవస్థలు పడ్డారు. గత నెలలో ఒకసారి, ఈ వారంలో రెండు సార్లు గోదావరి వరద స్థానికులను ఇక్కట్లకు గురి చేస్తోంది. ఇంకా రెండు మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అమావాస్య వస్తున్నందున దాని ప్రభావం గోదావరి వరదపై తీవ్రంగా ఉంటుందని పేర్కొంటున్నారు. వరదతో ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

అయినవిల్లి: వరదనీటి ప్రవాహం ఇంకా లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో కొనసాగుతోంది. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. వరదతో కొట్టుకొచ్చిన చెత్త, బురదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరద శాంతించి లంక గ్రామ ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ముక్తేశ్వరం తొగరపాయలో వరద ప్రవాహం కొనసాగుతోంది. వరద వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు లంక వాసులను హెచ్చరిస్తున్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.



అప్పనపల్లిలో ముంపు నీటిలో ప్రయాణికుల అవస్థలు



అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లి లంక మధ్య ఎదురెబిడెం కాజ్‌వేపై వరద ప్రవాహం

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: కొన్ని రోజులుగా కొనసాగుతున్న గోదావరి వరదలతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంకతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే మునిగిపోవడంతో ఆగ్రామ ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించిన పశువులకు మేత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ



మామిడికుదురులో మహ్మద్ ప్రవక్త జీవిత విశేషాలు వివరిస్తున్న ముస్లింలు

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకుడు మహ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ పండుగను శుక్రవారం ముస్లింలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మామిడికుదురు సున్నీ జామియా మసీదులో మిలాద్ నిర్వహించారు. పలువురు కవులు మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను వివరించారు. మహ్మద్ ప్రవక్త బోధనలను మహ్మద్ సాదిక్ అన్వర్ రజ్వీ వివరించారు. మిలాద్ అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా మసీదు ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు మసూద్ మొహిద్దీన్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, రాజ్, రఫీ, చమ్మెజాన్, మహ్మద్ మొహిద్దీన్ కిశ్వర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మసీదు కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

ప్రత్యేక ప్రార్థనలు

అంబాజీపేట: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకను అంబాజీపేట అంజుమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదు వద్ద కమిటీ అధ్యక్షుడు ఎండీ.రఫీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జయంతిని నిర్వహించారు. మసీదు వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు, అనంతరం పేదలకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, సురాజ్, ఇబ్రహిం, కరీముల్లా, ఆరీఫ్ పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపులో నిబంధనలు పాటించాలి



అంబాజీపేటలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

అంబాజీపేట: చవితి ఉత్సవాల సందర్భంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శనివారం నిర్వహించే ఊరేగింపులో కమిటీలు నిబంధనలు పాటించాలని, డీజేలు ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేస్తామని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. అంబాజీపేట వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండలంలో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన నియోజకవర్గ వినాయక విగ్రహ నిమజ్జన ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో శనివారం 230 విగ్రహాలు నిమజ్జనం చేస్తారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీలు పూర్తి బాధ్యత వహించాలన్నారు. రాత్రి 9 గంటలలోపే నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అశ్లీల నృత్యాలు, హిజ్రాలతో డ్యాన్స్‌లు నిర్వహించవద్దన్నారు. ఊరేగింపును భక్తి పారవశ్యంతో నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో అంబాజీపేట, అయినవిల్లి, పి.గన్నవరం, నగరం ఎస్సైలు కె.చిరంజీవి, బి.శివకృష్ణ, హరికోటి శాస్త్రి, ఎ.చైతన్యకుమార్, గణపతి నవరాత్రుల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



జిల్లాస్థాయి ఉత్తమ హెచ్‌ఎం పురస్కారాన్ని అందుకుంటున్న వరప్రసాద్



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న నాగరాజు, మహమ్మద్ తాహేర్ పాషా, కొల్లు రామ సత్యనారాయణ

మామిడికుదురు: మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ మట్టా నాగరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అమలాపురంలో శుక్రవారం గురుపూజోత్సవంలో భాగంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈఓ షేక్ సలీమ్ బాషా సమక్షంలో నాగరాజు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజును పలువురు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

అంబాజీపేట: మండలంలో ప్రధానోపాధ్యాయుడు, ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎల్.వరప్రసాద్, తొండవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు కందాల సీహెచ్ఎల్‌జీ.నరసింహరాజు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చిక్కాల శ్యామల కుమారి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు పలువురు అభినందనలు తెలిపారు.

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అంతర్వేదిపాలెం, అప్పనరామునిలంక పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు శుక్రవారం అమలాపురంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(హిందీ)గా పనిచేస్తున్న మహమ్మద్ తాహేర్ పాషా, అప్పనరామునిలంక శివారు కొత్తలంక ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొల్లు రామ సత్యనారాయణ కలెక్టర్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో అవార్డులు అందుకున్నారు.

అర్జునరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



పుణ్యమంతుల అర్జునరావు

అయినవిల్లి: మాగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పుణ్యమంతుల అర్జునరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం ఈ అవార్డును అమలాపురంలో గురుపూజోత్సవంలో భాగంగా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, డీఈఓ షేక్ సలీం భాషా చేతుల మీదుగా అవార్డును అర్జునరావు అందుకున్నారు. ఈ సందర్భంగా అర్జునరావును ఎంఈఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు కె. వెంకటాచార్య అభినందించారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రభావతి

సఖినేటిపల్లి: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్లో సఖినేటిపల్లిలంక గంటిమోహన్ చంద్ర బాలయోగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయినిగా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతి శుక్రవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్నారు.

అయినవిల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

చవితి మండపాల వద్ద అన్న సమారాధన

పి.గన్నవరం: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా పి.గన్నవరం గరుడేశ్వరాలయం వద్ద శివాలయం సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బాల గణపతి స్వామి లడ్డూకు యూత్ సభ్యులు వేలం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కర్రి బాబూరావు కుమార్తె మోడేకుర్రుకు చెందిన నంద్యాల పుష్పరాణి, సతీష్ దంపతులు రూ.7,500 వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

గణేశ్ లడ్డూ ప్రసాదం వేలం

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మాచవరం, అంబాజీపేట, పుల్లేటికుర్రు, గంగలకుర్రు పసుపల్లి, వాకలగరువులో నెలకొల్పిన చవితి పందిర్ల వద్ద శుక్రవారం అన్నసమారాధనలు నిర్వహించారు. మాచవరం మెట్లకాలనీ శ్రీరామ్ నగర్‌లో సిద్ధి వినాయక ఆలయం వద్ద స్వామి ఆలయంలో లడ్డూలకు వేలం నిర్వహించారు. కాకర శివ రూ.15వేలు, కుకునూరి కోటేష్ రూ.4,100, మీనాక్షి సిల్క్స్, సూర్యా రడీమేడ్స్ రూ.3,600 వేలంలో లడ్డూలను దక్కించుకున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పశువుల ఆస్పత్రి ఎదురుగా ఉన్న సత్యసాయి నగర్‌లో నెలకొల్పిన గణపతి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.



పి.గన్నవరంలో వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం

గురువులే భవిష్యత్తు నిర్దేశకులు



అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు

అయినవిల్లి: భావి భారత పౌరులను తీర్చిదిద్దేది గురువులేనని, గురువులే భవిష్యత్తు నిర్దేశకులని విశ్రాంత ఉపాధ్యాయుడు నిట్ల వెంకట్రావు అన్నారు. శుక్రవారం ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవాన్ని ప్రిన్సిపల్ సోమేశ్వరరావు ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు నిట్ల వెంకట్రావు ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి ప్రణాళిక వేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నిట్ల వెంకట్రావును, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు ఈ సందర్భంగా క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యపకులు వి.వెంకటేశ్వరరావు, కె.గోపాలకృష్ణ, ఎం.దుర్గ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్స్ డే

మలికిపురం: గొల్లపాలెంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్టా అనంతలక్ష్మి పాల్గొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సీహెచ్.వెంకట రాజ్యలక్ష్మి, నాగళ్ళ సుజాత, పాటి భూదేవీ, సూరుమేను రామలక్ష్మి పాల్గొన్నారు.

7న అప్పనపల్లి ఆలయం మూసివేత

మామిడికుదురు: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 7న ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయాన్ని మూసివేస్తామని ఈఓ వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సోమవారం సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి ఆలయంలో భక్తులకు దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని చెప్పారు.

జీవామృతంతో నత్రజని లోపం నివారణ

మామిడికుదురు: జీవామృతం వల్ల పంటలకు ఎంతో మేలు జరుగుతుందని ఈదరాడ యూనిట్ ఇన్‌చార్జ్ కుడుపూడి జానకి తెలిపారు. ఈదరాడ బీఆర్సీ సెంటర్‌లో యూనిట్ ఇన్‌చార్జ్ జానకి, ఐసీఆర్‌పీ చెల్లుబోయిన రాధ, డీఎంఎంటీ కుసుమ పద్మ శుక్రవారం 45 లీటర్ల జీవామృతం, 700 మిల్లీ లీటర్ల మీనామృతం తయారు చేశారు. స్థానిక రైతు యెరుబండి లక్ష్మయ్య కంఫర్ట్ బ్లాక్‌లో 3.50 ఎకరాల విస్తీర్ణంలో పోషక లోపానికి, నత్రజని లోపానికి జీవామృతం వినియోగించారు. ఎకరాకు 15 లీటర్ల జీవామృతం, 200 ఎం.ఎల్ మీనామృతం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ విధానం వల్ల నత్రజని లోపం తగ్గి పంట సమృద్ధిగా ఎదిగి మంచి దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రైతులందరూ ఆచరించాలని ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకునిగా సురేష్ రెడ్డి

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం అమలాపురంలో కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కళాశాల అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన సురేష్ రెడ్డికి అవార్డు రావడం అభినందనీయమని ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు కొనియాడారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

అంబాజీపేట: మండలంలో అంబాజీపేట, గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గల గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలో కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కంటి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

మలికిపురం: మండల పరిధిలోని దిండి గ్రామంలో డాకే అనితకు కంటి ఆపరేషన్ నిమిత్తం గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ శుక్రవారం రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని కత్తిమండ గ్రామంలో ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. రాపాక ఆదామ్ ప్రసాద్, బొబ్బనపల్లి తాతారావు, కొప్పాడ సునీత, తెన్నేటి ఫిలిప్, తరపట్ల మిధున్ చక్రవర్తి ఈ మొత్తాన్ని సమకూర్చారు. రాపాక చిన్ని, నక్కా రామారావు, నల్లి ప్రసాదరావు, కనికపాటి ఏసురాజు, పాలపర్తి శేఖర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణపతి నిమజ్జనోత్సవాలు

కొత్తపేట: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా విగ్రహాల నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఉత్సవ కమిటీలు, యువతకు సూచించారు. 9 రోజులపాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన పండితులను ఘనంగా సత్కరించారు. అనంతరం లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. పెద్ద లడ్డూను తణికెళ్ల శాస్త్రి రూ.12,300కు, చిన్న లడ్డూను చింతం శివ రూ 7,800కు పాడుకున్నారు. వానపల్లి బాలగణపతి ఉత్సవ పందిరిలో ఆలయ, ఉత్సవ కమిటీ కన్వీనర్ తోరాటి లక్ష్మణమూర్తి నాయుడు, సభ్యుల ఆధ్వర్యంలో పోలాబత్తుల నాగబాబు ఘనంగా సత్కరించారు. అనంతరం లడ్డూకు వేలంపాట నిర్వహించగా స్థానిక భక్తుడు వీరా ఏసు రూ.13 వేలకు పాడుకున్నారు.

అయినవిల్లి: స్థానిక మత్స్యకార కాలనీలో గణేశ్ నిమజ్జనోత్సవం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి ఊరేగించారు. యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని పంట కాలువలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. తొత్తర మూడి, నేదునూరు, విలస, సిరిపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో నిమజ్జనోత్సవం నిర్వహించారు.